క్లుప్తంగా

శుభకార్యం



వధూవరులతో జిల్లా అధ్యక్షుడు అనంత, మెట్టు గోవిందరెడ్డి, తదితరులు

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ లాలుసాబ్ కుమార్తె శేషిబి-షేక్ యాసిన్‌ల వివాహ వేడుక బళ్లారి రాయల్ స్టార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర జా యింట్ సెక్రటరీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, పంచాయతీ రాజ్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటాక్షిప తిరెడ్డి, కన్వీనర్లు బ్రహ్మానందరెడ్డి, రవీంద్ర నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయ కులు ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, మాబుసాబ్, కృష్ణ, సుదర్శన్‌రెడ్డి, యంత్రకాయల వన్నూరప్ప, మురళి తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న జెడ్పీహెచ్‌ఎస్ ప్రాంగణం



ఉద్దేహాళ్ పాఠశాల ఆవరణలో నిలిచిననీరు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ జెడ్పీ హెచ్‌ఎస్ ఆవరణ శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువును తలపిస్తోంది. పాఠశాల క్రీడామైదానంలో మోకాలిలోతు వరకు నీరు నిలిచింది. వేసవి సెలవులు కావడంతో వేలాది రూపాయలు వెచ్చించి మైదానాన్ని చదును చేయించారు. మరో రెండు రోజుల్లో క్రికెట్ పోటీలు జరగాల్సి ఉంది. అకాల వర్షంతో మైదానం నీటితో నిండింది.

అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ డే



రాయదుర్గంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న దృశ్యం

రాయదుర్గం టౌన్: ఎయిడ్స్‌పై సామాజిక చైతన్యాన్ని కల్గించేలా ఆదివారం సాయంత్రం రాయదుర్గంలో అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక ర్యాలీ నిర్వహించారు. మాస్ ఎడ్యుకేషన్ సంస్థ, ఐసీటీసీ విభాగం, ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. స్థానిక ఆస్పత్రి వద్ద ర్యాలీని ఆస్పత్రి వైద్యుడు మోహన్‌సాయి, హెడ్‌నర్సు పార్వతి ప్రారంభించారు. ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ అల్తాఫ్, పీయూ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడులోని ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో 3వతరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 3వతరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఎస్టీలకు 32, ఎస్సీలకు 05, బీసీలకు 02, ఓసీలకు 01 సీటు చొప్పు కేటాయించినట్లు తెలిపారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ కింద ఎస్టీ విద్యార్థులకు మాత్రమే మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 4వ తరగతిలో 40 సీట్లు, 5 వతరగతిలో 39 సీట్లు, 6వ తరగతిలో 35 సీట్లు, 7వ తరగతిలో 30 సీట్లు, 8వ తరగతిలో 18 సీట్లు, 9వ తరగతిలో 22 సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 8008134805, 9550330009లో సంప్రదించాలన్నారు.

దిష్టిబొమ్మల్లా హైమాస్ లైట్లు



అనంతపురం రహదారిలో చెట్ల మధ్యన వృథాగా ఉన్న హైమాస్ స్తంభం

రాయదుర్గం టౌన్: పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి హైమాస్ లైట్లు దిష్టిబొమ్మల్లా ఉన్నాయి. గతంలో సుందీకరణలో భాగంగా రూ.లక్షలు వెచ్చించి సిటీ ఛాలెంజింగ్ ఫండ్స్ కింద ఏర్పాటు చేసిన హైమాస్ స్తంభాలు నిరుపయోగంగా ఉన్నాయి. అప్పట్లో దాదాపు 150 హైమాస్ స్తంభాలను పట్టణంలోని అనంతపురం ప్రధాన రహదారి నుంచి కణేకల్లు రోడ్డు, బళ్లారి రోడ్డు, మొలకాల్మూరు రోడ్డుకు ఒక వైపు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కేవలం 70 దాకా లైట్లు నేటికి నిరుపయోగంగా ఉన్నాయి. స్తంభాలతోపాటు కొన్నింటికి దీపాలు కూడా ఉన్నాయి. మరికొన్ని చోట్ల కిందకు వాలి పడేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటిని తొలగించి శివారు ప్రాంతాలు లేదా హౌసింగ్ లేఅవుట్లలో ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ఇటీవల కౌన్సిల్‌మీట్‌లో పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

‘సాయం’ కరువు.. సేద్యం బరువు

- నాడు పండుగ..నేడు దండగ
- రైతులకు దక్కని ప్రభుత్వ భరోసా
- కరువు మండలాలు ప్రకటించి చేతులు దులుపుకున్న సర్కార్
- ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలు
- చేతిలో చిల్లిగవ్వ లేక ఆందోళన



చిన్నముష్టూరు వద్ద పొలాన్ని దుక్కిదున్నుతున్న రైతు



ప్రభుత్వం సాయం అందక దిగాలుగా కూర్చున్న బెళుగుప్ప రైతు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండుగలా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో దండగలా అనిపిస్తోంది. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఖరీఫ్, రబీ సీజన్లు దాటిపోతున్నా రైతులకు సాయం అందక, భరోసా లేక అయోమయంలో ఉన్నారు. మరో 20 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది.. చేతిలో చిల్లిగవ్వలేక , సేద్యపు పనులు చేసుకోలేక, పెట్టుబడి సాయం కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. జిల్లాలో ఏడు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా, ఇంత వరకూ పైసా అందించిన పాపాన పోలేదు. గతేడాది ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడి రాక, గిట్టుబాటు ధరలులేక, నష్టాల మూట కట్టుకున్న రైతులు.. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో బాధలు దిగమింగుకొని సాగుకు సమాయత్తమవుతున్నారు.

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో గతేడాది ఖరీఫ్‌లో 1,88,389 హెక్టార్లు సాగు చేయాల్సి ఉండగా, సుమారు 1,24,489 హెక్టార్లలో సాగు చేశారు. ఈఏడాది కుడా అంతే విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా. ఖరీఫ్‌లో ప్రధానంగా వేరుశనగతోపాటు వరి, జొన్న, సజ్జ, రాగులు, పెసర, కొర్రలు, మినుము, కంది, పత్తి, పంటలు సాగు చేస్తారు.

‘కరువు’ మండలాల సాయమేదీ?

కూటమి ప్రభుత్వం ఈఏడాది ఏప్రిల్‌లో రబీ సీజన్‌కు సంబంధించి ప్రకటించిన కరువు మండలాల్లో జిల్లాలోని బెళుగుప్ప, విడపనకల్లు, పెద్దవడుగూరు, తాడిపత్రి, యాడికి, యల్లనూరు, గుంతకల్లు మండలాలను ప్రకటించారు. ఈమండలాలకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు పైసా కూడా మంజూరు చేయలేదు. కేవలం ప్రభుత్వ ప్రకటనలకే పరిమితమైంది తప్ప.. చర్యలు మాత్రం లేవని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయం పండుగ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో వ్యవసాయం పండుగలా సాగింది.అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసే రైతులకు పెట్టుబడి సాయం..పీఎం కిసాన్ నిధితో కలిసి వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 ఏటా అందించారు. పల్లెల్లోనే ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించారు. ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నావడ్డీ పథకాలన్నీ ఎప్పటికప్పుడు అమలు చేశారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో వైఎస్సార్ బీమా కింద 3,77,821 మంది రైతులకు రూ.540.81 కోట్లు, రైతు భరోసా కింద 7,35,353 మందికి రూ.957.64 కోట్లు, వైఎస్సార్ సున్నావడ్డీ కింద 1,21,612 మందికి రూ.32.36 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ కింద 82,360 మంది రైతులకు రూ.134.52 కోట్లు అందించారు.

ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు ఇలా..

మొత్తం రైతులు	దెబ్బతిన్న పంటల విస్తీర్ణం (హెక్టార్లలో)	విడుదలైన మొత్తం
82,360	93,966	రూ.134.02 కోట్లు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో

సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	ఖరీఫ్ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
1,88,389	1,24,489
వైఎస్సార్‌సీపీ హయాంలో 2019 నుంచి 2023 వరకు బీమా పరిహారం ఇలా..	
లబ్ధి పొందిన రైతులు	2019-2023 వరకు జమ అయిన మొత్తం (రూ.కోట్లలో)
3,77,821	540.81
2019 - 2024 వరకు మంజూరైన రైతు భరోసా నిధులు	
మొత్తం రైతులు	జమ అయిన మొత్తం
7,35,353	రూ957.64కోట్లు
2019 -2024 వరకు వైఎస్సార్ సున్నా వడ్డీ నిధులు	
మొత్తం రైతులు	మంజూరైన నిధులు
1,21,612	రూ.32.36 కోట్లు

ప్రయోజనం లేదు



విడపనకల్లును కరువు మండలంగా ప్రకటించినా ఇప్పటి వరకు ప్రభుత్వం రైతులకు ఎలాంటి సహాయం అందించలేదు. పంటలు చేతికందగా పెట్టుబడులు కూడా వెనక్కి రాని పరిస్థితి నాది. ఇప్పటికే రూ.15 లక్షలకు పైగా అప్పు అయ్యింది. తీర్చేమార్గంలేదు. ప్రభుత్వ సాయం లేదు.

– రాఘవేంద్ర, రైతు, వి.కొత్తకోట గ్రామం, విడపనకల్లు

చేతిలో చిల్లిగవ్వలేదు



ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతోంది. పెట్టుబడి సాయం అందలేదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. సాగుకు ఎలా సిద్ధం కావాలో అర్థం కావడం లేదు. రెండేళ్లుగా పంటలు చేతికందగా ప్రభుత్వం సాయంలేక, అప్పుల బాధతో అల్లాడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం కరువు సాయంతో పాటు ఖరీఫ్ పెట్టుబడికి సహాయం అందించాలి.

– తిప్పేస్వామినాయక్, బెళుగుప్పతండా, బెళుగుప్ప

అన్నదాత సుఖీభవ ఏదీ?



కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అమలు చేస్తామని చెప్పి ఏడాది అవుతున్నా అమలు చేయలేదు. ఈఏడాదైనా పెట్టుబడి సహాయం కింద సుఖీభవ అమలు చేస్తే రైతులకు ఎంతో మేలు చేసిన వారు అవుతారు. చేతిలో చిల్లి గవ్వలేదు. పంటలు ఎలా సాగు చేయాలో దిక్కుతోచడంలేదు.

– గోపాల్, రైతు కమలపాడు గ్రామం, వజ్రకరూరు మండలం

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తోంది..



కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలు అమలు చేస్తూ, పాలన సాగిస్తోంది. ఏడాది పాలనలో రైతులకు మేలు చేసే ఒక్క కార్యక్రమమైనా చేపట్టలేదు. అన్నదాత సుఖీభవ ప్రకటనలకే పరిమితమైంది. రైతులు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర రాక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఐదేళ్లలో రైతులకు మేలు చేసే విధంగా ఎన్నో కార్యక్రమాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారు. ఈ నాలుగు నెలల్లోనే ఉరవకొండ నియోజకవర్గంలో ఏడుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కనీసం వారి గురించి పట్టించుకున్న పాపానపోలేదు.

– వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ

అసైన్డ్ భూముల్లో అర్ధరాత్రి తవ్వకాలు



బాదనహాళ్ వద్ద ప్రభుత్వ భూముల్లో మట్టిగోతులు ఇలా



మడేనహళ్లి - లింగమ్మనహళ్లి మధ్య మట్టి తవ్వగా ఏర్పడిన గోతులు

- దుర్గంలో గుట్టుగా మట్టి దోపిడీ
- కరిగిపోతున్న కొండ గుట్టలు
- రోజూ రూ.లక్షల్లో చేతులు మారుతున్న వైనం

రాయదుర్గం: నియోజకవర్గంలోని కూటమి నాయకులు కొందరు గుట్టుగా గుట్టలను తవ్వేస్తూ, మట్టి దోపిడీ చేస్తున్నారు. కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, చెరువులు, కాలువ గట్లపై ఉన్న మట్టిని కూడా తరలించేస్తున్నారు. అధికారులు మల్లికేతి చెరువులో మట్టి తవ్వకాలను అడ్డుకుంటే తాజాగా కల్యంలో మొదలుపెట్టారు. ఇటీవల బాదనహాళ్ వద్ద కల్లుమడి మాన్యంగా చెప్పుకునే ప్రభుత్వ భూమిలో చీకటి పడగానే మట్టి తరలించారు. దీంతో ఆ ప్రాంతంలో ఎటు చూసిన గోతులు కనిపిస్తున్నాయి.

సరిహద్దులో ఆగని దోపిడీ..

కర్ణాటక సరిహద్దునున్న డి హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో మట్టి తవ్వకాలు ఆగడం లేదు. చీకటి పడితే చాలు..ఆ ప్రాంతాల్లో యథేచ్ఛగా మట్టి తరలింపు జోరుగా సాగుతోంది. డి హీరేహాళ్ మండలంలోని మడేనహళ్లి, లింగమనహళ్లి మధ్య కొండల్లో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఓబుళాపురం సమీపంలో హైవే ముసుగులో మట్టి దందా సాగుతోంది. పట్టణంలోని కణేకల్లు రోడ్డు, గౌడ లేఔట్‌కు ఆనుకొని ఏర్పాటు చేసిన జగనన్న లేఔట్ పక్కన గుట్టల్లో మట్టి కరిగిపోతోంది. బళ్లారి మల్లాపురం లేఔట్, గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డి ప్రాంతాల నుంచి మట్టి తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఫిర్యాదులు వస్తే దాడులు చేస్తాం..

అసైన్డ్ భూముల్లో ఎక్కడైనా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం వచ్చిన వెంటనే దాడులు చేస్తున్నాం. బాదనహాళ్ వద్ద కల్లుమడి మాన్యం భూముల్లో మట్టి తవ్వకాలను అడ్డుకున్నాం. ప్రస్తుతం మండలంలో మట్టి తవ్వకాలు జరుపుతున్నట్టు ఎలాంటి ఫిర్యాదులూ అందలేదు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేస్తున్నాం. దీంతో తవ్వకాలకు బ్రేక్ పడింది.

– మునివేలు, ఇన్‌చార్జ్ తహసీల్దార్, డి హీరేహాళ్

అశ్వవాహనంపై వేంకటరమణుడి దర్శనం



అశ్వవాహనంపై ఊరేగిన ప్రసన్న వేంకటరమణస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో కొలువైన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీవారి పార్వేటోత్సవం, అశ్వవాహనోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై సతీసమేతంగా శ్రీవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రెడ్డి సంక్షేమ సంఘం, ఆరే కటిక, నాయీబ్రహ్మణ, ఈడిగ సంఘాల ఆధ్వర్యంలో శ్రీవారి అశ్వవాహన సేవ నిర్వహించారు. సోమవారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం శ్రీవారి మయూర వాహనోత్సవం జరుగుతుందని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు గౌని ఉపేంద్రరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, గౌని శ్రీరామిరెడ్డి, కౌన్సిలర్ గౌని లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐపై కఠినచర్యలు తీసుకోవాలని నిరసన



ఫిర్యాదు చేస్తున్న బాధితుడి కుటుంబ సభ్యులు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ హసీనాబానుపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు సాయి కుటుంబ సభ్యులు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధితుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఎక్సైజ్ సీఐ అవినీతి, అక్రమాలు బయటకు పెట్టినందుకు సాయి పై చెప్పుతో దాడి చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. రెండు రోజుల నుంచి సీఐ నుంచి బెదిరింపులు ఎక్కువయ్యాయని బాధితుడి కుటుంబ సభ్యులు వాపోయారు.

గదుల్లోకి దిగుతున్న వర్షపునీరు

కూడేరు: ఎంపీడీఓ కార్యాలయంలో చిన్నపాటి వర్షం కురిసినా గదుల్లోకి నీరు దిగుతోంది. దీంతో రికార్డులు, కంప్యూటర్లు తడిసిపోతున్నాయి. సిబ్బంది గదుల్లో కూర్చోలేక పోతున్నారు. సిబ్బంది కంప్యూటర్లపై వర్షపు నీరు పడకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పి ఉంచాల్సి వస్తోంది. దీనికి తోడు కొంత కాలం నుంచి కార్యాలయ భవనం పైకప్పు నుంచి సిమెంట్ పెచ్చులూడి కింద పడుతున్నాయి.

ఉదిరిపికొండ తండాలో తాగునీటి ఎద్దడి



కూడేరు: మంచినీరు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండ తండాలో తాగునీటి కోసం తండావాసులు కష్టాలు పడుతున్నారు. ఉదిరిపకొండ పంచాయతీలోని మజరా గ్రామంలో సుమారు 200 కుటుంబాలు, 1000 దాకా జనాభా ఉంది. గ్రామానికి కిలోమీటరు దూరంలో పంచాయతీ బోరు వేయించి, అక్కడి నుంచి పైపులైన్ ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకుకు నీరు సరఫరా చేస్తున్నారు. అయితే పంచాయతీ మోటారుకు కనెక్షన్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కొందరు వ్యవసాయ మోటార్లకు కనెక్షన్ తీసుకున్నారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఓవర్‌లోడ్ కావడంతో లోఓల్టేజీ సమస్య తలెత్తి, మోటారు పనిచేయలేదు. దీనికితోడు అధికార పార్టీ నాయకులు ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్‌కు డ్రిప్ పైపులతో కనెక్షన్లు తీసుకున్నారు.దీంతో ట్యాంకుకు నీరు ఎక్కక, ఎగువ ప్రాంతంలో నీటి ఎద్దడి నెలకొంది. పొరుగు గ్రామమైన మరుట్ల -3 కాలనీ నుంచి నీరు తెచ్చుకుంటున్నారు.

కుండపోత వర్షం


- పొంగిపొర్లిన వంకలు, వాగులు
- వరద ఉధృతికి కొట్టుకుపోయిన వరిధాన్యం రాసులు
- ఆందోళనలో రైతులు



సొల్లాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంక



కణేకల్లులో తడిసిన వరిధాన్యాన్ని ట్రాక్టర్‌లోకి లోడ్ చేస్తున్న రైతులు



వరదనీటితో పొంగి పొర్లుతున్న గాజుల మల్లాపురం వంక

కణేకల్లు: కణేకల్లు మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. అకాల వర్షం వరి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. కణేకల్లు, సొల్లాపురం, పెనకలపాడు, మాల్యం, గరుడచేడు, తుంబిగనూరు, నాగేపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వర్షపాతం 46.80 ఎంఎం నమోదైంది. బెలుగుప్ప, పెనకలపాడు తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి వంకలు, వాగుల్లో వరద ఉధృతి పెరిగింది. సొల్లాపురం, నాగేపల్లి వంకలు పొంగి ప్రవహించాయి. సొల్లాపురం వంకలో భారీస్థాయిలో వరదనీరు పారడంతో ఆదివారం 10 గంటల వరకు వాహన రాకపోకలు స్తంభించాయి. నాగేపల్లి, తుంబిగనూరు రైతులు వరి ధాన్యం రోడ్లపై ఆరబెట్టుకోగా, వర్షానికి ధాన్యం రాసులు కొట్టుకుపోయాయి. నాగేపల్లి గ్రామానికి చెందిన గుడందప్ప గారి రామాంజినేయులుకు చెందిన 60 బస్తాల వరిధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. బాలప్పగారి ఎర్రిస్వామి చెందిన 20 బస్తాల వరిధాన్యం కొట్టుకోపోయింది. హోటల్ మలక్కన్న, గూని అనిమేష్, పెనకలపాడు పాతన్న వరిధాన్యం వర్షానికి తడిసిముద్దయ్యింది. కణేకల్లులోని జెడ్పీహైస్కూల్ గ్రౌండ్‌లో రైతులు వేసిన వరిధాన్యం రాసులు తడిసిపోయాయి. రచ్చుమర్రిలో భారీ వర్షానికి పశువుల పాక పైకప్పు కూలి రైతు హనుమంతప్పకు చెందిన దున్నపోతులు, పాడి ఎనుములు మృతి చెందాయి. రెండు దున్నపోతుల విలువ రూ.1.50 లక్ష కాగా.. పాడి ఎనుము రూ.80వేలు అని బాధిత రైతు తెలిపాడు. మరో రెండు దున్నపోతుల కాళ్లు విరిగిపోయాయని తెలిపాడు.

239 ఎం.ఎం వర్షపాతం నమోదు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు జడివాన కురిసింది. నియోజకవర్గ వ్యాప్తంగా 239.2 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. రాయదుర్గంలో 45.6 ఎం.ఎం, బొమ్మనహాల్‌లో 67.4 ఎం.ఎం, గుమ్మఘట్టలో 52.2 ఎం.ఎం., కణేకల్లులో 46.8 మిల్లీమీటర్లు, డి.హీరేహాళ్‌లో 27.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

67.4 మి.మీటర్ల వర్షపాతం నమోదు

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి వర్షం దంచికొట్టింది. ఉరుములు,మెరుపులతో పాటు కుండపోత వాన కురిసింది. మొత్తం 67.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షానికి పత్తి పంటలు నీట మునిగింది. పలుచోట్ల చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతల్లోకి నీరు చేరింది.

గుమ్మఘట్టలో 52.2మి.మీ వర్షపాతం

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి 52.2మి.మీటర్ల వర్షపాతం కురిసింది. వర్షం రాకతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రెండు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.

పొంగిపొర్లిన వాగులు,వంకలు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు,మల్లాపురం, హావళిగి, కరకముక్కల, విడపనకల్లు, గడేకల్లు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పాల్తూరు,గాజుల మల్లాపురం రహదారిలో ఉన్న పెద్ద వంక భారీగా వరదనీటితో పోటెత్తింది. పాల్తూరు, దర్గాహొన్నూరుకు వెళ్లే రహదారిలో ఉన్న వంక ఉధృతంగా పారడంతో రాకపోకలకు ఆటంకం కలిగింది.

వజ్రకరూరు: మండల కేంద్రంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. మెయిన్ రోడ్డు మీదుగా వర్షపునీరు పారింది. అక్కడి నుంచి వర్షపునీరు చెట్టుకుంట వైపు పారింది.

బెళుగుప్పలో భారీ వర్షం

బెళుగుప్ప: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి 75.4 ఎంఎం వర్షపాతం నమోదైందని ఏఓ పృథ్వీసాగర్ తెలిపారు. భారీ వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా పారాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కూడేరు: మండల పరిధిలోని కుష్టురోగుల కాలనీ వద్ద అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కమ్మూరుకు చెందిన విజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. కడదరకుంటకు చెందిన రామాంజనేయులు స్వల్పంగా గాయపడ్డాడు. విజయ్ అనంతపురం నుంచి కమ్మూరుకు, రామాంజనేయులు అనంతపురం వెళ్తుండగా ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. స్థానికులు విజయ్‌ను ఆటో లో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

రేపు ఆలయ హుండీ కానుకల లెక్కింపు

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం ఆలయ హుండీ కానుకల లెక్కింపు మంగళవారం ఉంటుందని ఈఓ రమేష్‌బాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ఉంటుందన్నారు.